
# హరాం

ఖాజా



బస్సొచ్చి ఆగిందో లేదో–అప్పటిదాకా విసుగ్గా, అసహనంగా నిల్చున్న పాసెంజర్లందరిలోనూ ఒక్కసారిగా చలనం కలిగింది. ఒకళ్ళకంటే ముందు ఒకళ్ళు ఎక్కాలని అరుచుకుంటూ తోసుకుంటూ బస్సు డోర్‌చుట్టూ కందిరీగల్లా మూగారు. దిగేవాళ్ళు కిందికి దిగలేక–ఎక్కేవాళ్ళు పైకెక్కలేక ఫుట్‌బోర్డ్ కిక్కిరిసింది.

అప్పటిదాకా బస్‌స్టాప్‌లో నిల్చుని బబుల్‌గమ్స్‌తో పాటు ఆరోజు కాలేజిలో అమ్మాయిల్ని ఎలా టీజ్ చేశారో నెమరేసుకుంటున్న అబ్దుల్‌గ్యాంగ్ బస్సు దగ్గరికి పరుగెత్తుకొచ్చారు. అంత రద్దీలోనూ అతి నైపుణ్యంగా ఎక్కి సముద్రాన్ని ఈదే గజీతగాళ్లలా ముందుకెళ్లిపోయారు. సాయంత్రం అయిందంటే చాలు – సుల్తాన్‌బజార్లో చక్కర్లు కొడుతూనో, టాంక్‌బండ్‌మీద పల్లీలు తింటూ అప్పుడే విరబూసిన హైదరాబాదీ అమ్మాయిల అంగాలలోకి చూపులు దించుతూనో, రష్‌గా వున్న సిటీబస్సుల్లో ఎక్కి అమ్మాయిల్ని ఆనుకుని నిల్చుని, డ్రైవర్ బ్రేక్ వేసినా వేయకపోయినా వయసువేస్తున్న సడెన్‌బ్రేక్‌కి తుల్లి వాళ్లమీద పడుతూ–వాళ్లని కామెంట్‌చేస్తూ వాళ్ల చేత తిట్లుతింటూ అదే జీవితమని ఆనందపడుతూ గడిపేయడానికి అలవాటుపడ్డ సగటు ముస్తాఫాలు వాళ్లు.

రొటీన్ ఆనందంలో భాగంగానే ఈరోజుకూడా రద్దీ బస్‌లోకి ఎక్కేశారు. ఎక్కినంత సులువుగా రాకెట్‌వేగంతో 'పసుపురంగు సీట్ల' దాకా వెళ్లిపోయి ఉసూరుమన్నారు.

"ఏందమ్మా మీదమీదపడ్తున్నావ్ జరంత దూర ముందు"

"ఎవల్ని అంటకుంట ముట్టకుంట బోవాల్నంటే ఏ ఆటోలోనో, కార్లోనో బోవాలె. గీ బస్సులెందుకెక్కినవ్"

"నువ్‌జెప్పాలె మరి మాకంత దమాకేడ్ది"

ఎవరో ఇద్దరు నడికారు స్త్రీలు తగాదాపడుతున్నారు.

అంత జనం వున్న బస్సూ థార్‌ఎడారిలా తోచింది వాళ్లకి. ఎంతో ఆశతో కష్టపడి ఎక్కిన బస్సులో ఒక్క అమ్మాయి కూడా లేదు. అన్నమూ నీళ్లూ దొరకని దీవుల్లోనైనా వాళ్లు యుగాలు యుగాలు బతికేయగలరుకానీ అమ్మాయిలు లేనిచోట అరక్షణం కూడా నిలవలేరు.

"అబ్బా ... ఇక్కడేదో సతతహరితారణ్యాలుంటాయని ఎక్కితే ఈ బస్సేందిరా బాభూ ఒక మహాశిశిరమై కూర్చుంది" అబ్దుల్ గొంతులో అసహనం.

"అవునుగూరూ ఈరోజు మన నసీబేం బాగాలేదు. బస్టాప్‌లో ఒక్క ఫిగరూ లేదు. బస్సులోనూ లేరు. సుల్తాన్‌బజార్లెల్లినా పోయేది. ఇప్పుడే ఇంటికెళ్ళినా బోరు" – మరొకడు.

"చల్‌రే ఎప్పుడూ బజార్లూ–బస్సులేనా! ఆజ్ మూవీ జాయెంగే" ఇంకొకడు కొత్త ప్రోగ్రామిచ్చాడు.

"కోన్‌సా మూవీ జాయెంగే" కళ్లలో పడే క్రాపుని వెనక్కి నెట్టుకుంటూ అడిగాడు అబ్దుల్.

"టబుకా మూవీ హైనా – 'దునియా దిల్‌వాలోంకి' వోదేఖేంగే"

ఒకళ్లు సిన్మాకెళ్ళాలని మరొకళ్ళు వొద్దని గోలగోలగా మాట్లాడుకుంటున్నారు. నిజానికి వాళ్ల ప్రోగ్రాం ఎప్పుడూ ఫిక్స్‌డ్ కాదు. కనిపించే అమ్మాయిల్నిబట్టి ఎప్పటికప్పుడు ప్రోగ్రాం మారిపోతూ వుంటుంది. సినిమా ప్రోగ్రాం షాపింగ్‌కి, షాపింగ్ ప్రోగ్రాం హోటెల్‌కి, హోటెల్ ప్రోగ్రాం టాంక్‌బండ్‌కి, టాంక్‌బండ్ ప్రోగ్రాం ఇందిరాపార్క్‌కి – ఇలా ఏ ప్రోగ్రాం ఎప్పుడు ఎలా మారుతుందో ఎవరూ ఊహించలేని పోస్ట్‌మాడర్న్ టైంటేబుల్ వాళ్ళది.

బస్సులో జనం అంతా ఎవరి లోకంలో వాళ్లున్నారు. జైళ్ల నుంచి విడుదలైన ఖైదీల్లా ఆఫీసుల నుంచి బయల్దేరిన ఉద్యోగులు, స్కూళ్ళ నుంచి ఎంత త్వరగా ఇంటికెళ్ళి ఆడుకోవాలా అని ఆరాటపడే పిల్లలు, ఈరోజు కూడా దొరకని ఉద్యోగాల్ని గురించి తిట్టుకుంటూ ఆఫీసులచుట్టూ తిరిగి తిరిగీ అరిగిన కాళ్ళతో ఇంటిదారిపట్టిన నిరుద్యోగులూ, షాపింగ్ చేసుకుని తిరిగివెళ్ళే స్త్రీలు–ఇలా బస్సు మొత్తం జమ్మూకాశ్మీర్‌లా వుంది. మక్కాలో ప్రతియేటా జరిగే తొక్కిసలాట – హైద్రాబాద్ సాయంత్రపు సిటీబస్సుల్లో ప్రతిరోజూ మామూలే!

స్పీడ్‌గా వెళ్ళే బస్సుకు ఒక్కసారిగా బ్రేకపడ్డంతో అంతా తలా ఓ పెగ్గు స్కాచ్ తాగినట్టు, ఒక జర్క్ అలా ఇచ్చుకుని మళ్లీ సెట్రయిట్టైపోయారు.

ఏదో స్టాప్. ఆగిన బస్‌లోంచి ఒకరిద్దరు దిగగానే ఐదారు మెరుపుతీగెలు గబగబా ఎక్కేశాయి. అన్నీ బురఖాలే!

అబ్దుల్‌గ్యాంగ్‌కి ప్రాణం లేచొచ్చింది.

"అరేయ్ 'మన కంపెనీ' పక్షులురా" అబ్దుల్.

"అచ్చా–బస్‌లో ఇంతసేపూ తెగ బోర్‌కొట్టి చచ్చాం కదరా!" మరొకడు.

బురఖా ముస్లిం స్త్రీల శరీరాన్నేకాదు–వాళ్ల కలల్నీ, రూపాన్నీ, వయసునీ ఒకటేంది– వాళ్ల అస్తిత్వాన్నే కంప్లీట్‌గా చెరిపేసి కాసింత చీకటిని పోగులేస్తుంది. బంధుత్వాలు బురఖాలముందు ఓడిపోతాయి. పరిచయాలన్నీ అపరిచయాలుగా మారిపోతాయి. అందులో వున్నవాళ్ళెవరో గుర్తించడం చాలా కష్టం. బహుశా ఆ అల్లాకి కూడా! అయితే బురఖాని చూసీ చూడగానే అది వివాహిత బురఖానో, అవివాహిత బురఖానో ఇట్టే చెప్పగల టాలెంట్ అబ్దుల్‌లో వుంది. దానికోసం తన ప్రతిభనంతా ధారపోసి ఒక ఫార్ములా కనుక్కున్నాడు. ముందుగా వాళ్ల పాదాలు చూసి 'ఛల్లె' (మెట్టెలు) వున్నాయో లేదో, లోపల వేసుకుంది షట్‌సల్వారో – చీరో గమనించి వాళ్ల జాతకం మొత్తం చిటికెలో చెప్పేయగలడు.

బురఖాలు సరాసరి వీళ్లున్న దగ్గరికే వొచ్చి నిల్చున్నారు. అందులోంచి ఒక బురఖా గోలగా అరుస్తున్న వీళ్లవైపు తలతిప్పిచూసింది. ఆ తలతిప్పిన వేగంలో ఒక విసుగు తళుక్కుమంది.

అబ్దుల్ వాళ్ళనే గమనిస్తుండడంతో ఇద్దరి చూపులూ ఢీకొని–ఆ చూపులమధ్య ఘనీభవించిన శూన్యం బద్ధలైంది.

ఆ కళ్ళలోంచి సంధించిన జీవచైతన్యమేదో అబ్దుల్‌కి కొత్త ఊపునీ ఉత్సాహాన్నీ ఇచ్చింది.

తను ఎప్పుడో ఏ ఆదమరుపులోనో పారేసుకున్నాననుకున్న కల కాస్తా మళ్లీ అబ్దుల్ కళ్లలోకొచ్చి చేరింది. ఆ చూపుల తాకిడితో మనసంతా శరీరమంతా ఏదో అరేబియన్ పరిమళం ఆవరించినట్లైంది.

'చుట్టూ అలుముకున్న మబ్బుల మధ్య రెండుగా విడిపోయిన చంద్రుడిలా – చీకటిలో సైతం ప్రకాశించగల విరబూసిన రెండు గుల్‌మొహర్ పువ్వుల్లా ఎక్కడో ... ఎక్కడో తను బాగా ఎరిగిన కళ్లవి' అబ్దుల్ ఆలోచిస్తూ ఆమెనే గమనిస్తున్నాడు. ఆమె కూడా అప్పుడప్పుడూ అబ్దుల్ వైపు చూస్తుంది–అదో రకం ఆశ్చర్యం నిండిన కళ్లతో.

'ఎవరీమె ... ఎందుకు తనవైపు చూస్తుంది. నిఖా అయివుంటుందా – కాళ్లు చూద్దామంటే కదల్లేని స్థితి. కిక్కిరిసిన జనం, తలతిప్పడానిక్కూడా వీల్లేదు. పెళ్లయిందో కాలేదో ఎలా తెలుస్తుందీ!' తన ఫార్ములాకి సైతం లొంగని ఆమె. అతన్లో వేయికత్తులు మరలా వేగంగా సుడితిరుగుతూ ...



వెనుక నుంచి ఎవరో అబ్దుల్‌కి తగిలారు. తూలి ఆమె మీద పడ్డాడు.

"మాఫ్‌కర్‌నా ఎవరో వెనకనుంచి నెట్టారు".

ఆమె పలకలేదు. శతాబ్దాల క్రితం దింపిన రెప్పలను అతికష్టంమీద ఎత్తి చూసింది. ఆ చూపులో ఏదో దిగులు. అసహ్యం–అలసట–బలహీనత–అణగారినతనం–అనాగత దుఃఖం– కనుకొలుకుల్లో బుసలు కొడుతున్న నీటిపాము.

"రేయ్ కోన్‌రే వో – రే మున్నా జరసర్దుకో" – మళ్లీ ఆమెవైపు తిరిగాడు. 'ఆ కళ్లు ... ఆ కళ్లు ... ఆ కళ్ళలో ఏదో ఏదో ..... ఎవరీమె' ఎంతకీ జ్ఞాపకం రావడం లేదు అబ్దుల్‌కి.

ఆమె ఒదిగిపోయి శరీరంలో శక్తినంతా ఎవరో పీల్చేసినట్టు ఇనపస్తంభానికి జారగిలపడి నిలబడింది. ఆమె బురఖాలోంచి ఒక అనుమానం. ఒక దగాపడ్డతనం మెలికలుతిరుగుతున్న పూద్‌లా–

బోర్లించిన దీపపు సెమ్మెలా, బురఖా లోపల ఆరిపోయిన దీపంలా, ఉడుకుతున్న మాంసంముద్దలా, రగులుతున్న అగ్నిపర్వతంలా – ఆమె.

'పాత గుడ్డపీలికలు తొక్కి కుట్టిన అతుకుల బొంత జీవితం. కళ్లకు తప్ప శరీరానికి సోకని గాలీ వెలుతురు. లోకం మొత్తానికీ అపరిచయమైన బతుకు. కాటన్, సిల్క్, పాలిస్టర్, దూప్‌చా – గుడ్డ ఏదైనా–ఒకే రంగు.

సర్ బంద్

సీనా బంద్

భేజా బంద్

నస్లే బంద్

జిందగీ బంద్

ఐదు వస్త్రాలతో చచ్చాక కూడా పర్దా పాటించే బతికున్న శవం. ఆమె లోపల అగ్నిపర్వతం రగులుతుంది. కళ్లలో మాత్రం కరుగుతున్న మంచుకొండలు.

అబ్దుల్‌కి ఆమె కళ్ళభాష అర్థం కావడంలేదు. వాటిలో జీరబోయిన దుఃఖం గడ్డకట్టిన వెక్కిళ్ళూ అర్థంకావడంలేదు.

ప్రేమగా పెంచిన యజమానే కర్కశంగా గొంతు కోసినప్పుడు మేకకళ్లలో చివరిసారిగా తొణికే ఆశ్చర్యం లాంటిదేదో–ఆమె కళ్లలో.

బస్ మలుపుతిరిగింది – వేగంగా

అబ్దుల్ మళ్లీ తూలి ఆమెకు తగిలాడు. ఈసారి కావాలనే– తొలకరి మెరుపులాంటి తొలివలపు తళుకేదైనా ఆమె కళ్లలో మెరుస్తుందనుకున్నాడు. నెలవంకల్లాంటి రెండు రెప్పలనెత్తి – చూపుల లేతవెన్నెలను తనమీద ప్రసరిస్తుందనుకున్నాడు.

కానీ–ఆమె కళ్లలో మాత్రం ఉరుములు, నిశ్శబ్దపు ఫెళఫెళారావాలు. కుంభవృష్టికి ముందుండే నీలిమేఘాల ఒరిపిళ్ళు.

చివరిస్టాపులో బస్సాగింది. అందరూ దిగుతున్నారు. వెళ్ళిపోతున్నారు. ఆమె కూడా వెళ్ళిపోతుంది.

ఒక్కసారన్నా వెనక్కి తిరిగి చూస్తుందన్న ఆశతో అబ్దుల్ ఆమెనే గమనిస్తూ నిల్చున్నాడు.

** ** **

"అమ్మీ ఆగయ్ ... అమ్మీ ఆగయ్ ..." ఇంట్లో అడుగుపెట్టగానే వాకిట్లో ఆడుకుంటున్న పిల్లలిద్దరూ ఆమెను చుట్టేశారు.

అమ్మీ బజారుకెళ్ళి వొచ్చిందంటే తినడానికి చాక్లెట్లో, బిస్కట్లో తెస్తుందని వాళ్ళ నమ్మకం. అలా తెస్తానని మాటిస్తేనే ఆమె బయటకు వెళ్ళడానికి వాళ్ళ నుంచి పర్మిషన్. లేదంటే మేమూ వస్తామని మారం చేస్తారు. అయితే ఇవాళ బస్‌లో జరిగిన సంఘటనతో దిగగానే బిస్కట్లు కొనాలనుకున్న సంగతే మర్చిపోయింది.

పిల్లలిద్దరూ ఆమెను చుట్టుకుని గోల చేస్తున్నారు. ఆమె మాత్రం ఈ లోకంలో లేదు. బస్‌లో జరిగిన సంఘటనే ఆమె గుండెల్ని పిండుతుంది. పిల్లలిద్దర్నీ వొదిలించుకుని ఇంటి వెనక్కి నడిచింది.

జామచెట్టుకింద మంటపెట్టి, చెట్టుకింద రాలిన ఆకులూ, చెత్తా చెదారం అంతా తెచ్చి మంటలో వేస్తోంది రెండో కూతురు మున్నీ. తల్లిని చూడగానే 'అమ్మీ గాజులు తెచ్చావా' అడిగింది. ఎంతకీ సమాధానం రాకపోయేసరికి తలెత్తి తల్లివైపు చూసి ఉలిక్కిపడింది.

'ఆమె' కళ్లలో కట్టలు తెగిన దుఃఖం. ఎడతెరిపిలేని వెక్కిళ్ళు. ఎప్పుడూ ఎంత కష్టాన్నైనా అమాయకమైన నవ్వుతో భరించగల ఆమె ఏడుస్తోంది. మున్నీకి భయం వేసింది. తల్లిలో నిర్లిప్తత గురించి ఆ పిల్లకి తెలుసుగానీ ఈవేళ మరీ డీలాపడ్డ ఆమె కళ్లలో భావాల్ని తను చదవలేకపోతోంది.

ఆమె కళ్లలో ఎదురుగా మండుతున్న జామ ఆకులమంట దగదగా మెరుస్తోంది. మంటకు మరీ దగ్గరగా వెళ్ళి నిలబడింది. బురఖా సిల్కుది కావడంవల్ల ముదుచుకొస్తున్నట్లనిపించింది.

మున్నీకి భయం మరింత ఎక్కువైంది తల్లి చేస్తున్న పనేమిటో – అసలు ఎందుకలా వుందో అర్థం కావడంలేదు. 'అమ్మీ ... అమ్మీ ...' వెనకనుంచి పట్టుకుని కుదిపింది.

కూతురి చేతులని విదిలించుకుని బురఖా విప్పింది. అంతా ముద్దగా చేసి కళ్లదాకా తీసుకువెళ్ళింది. శబ్దం కాకుండా మంటలోకి విసిరేసింది. సిల్కుగుడ్డ వటంవల్ల మంట ఒక్కసారే గుప్పున పైకెగసింది.

పాలరాతిలాంటి ఆమె తెల్లటి శరీరంమీద మంటలు ప్రతిబింబిస్తున్నాయ్.

ఎదురుగా చూస్తున్న మున్నీకి పిచ్చెత్తినట్లుంది. ఏమీ అర్థంకావటంలేదు. తల్లి బురఖాని తగలబెట్టింది. 'అమ్మో! అబ్బాజాన్‌కి తెలిస్తే ఏమన్నావుందా!'

ఆమె మాత్రం తనలోకంలోనే వుంది. నెత్తిమీదుగా పైటచెంగు లాక్కుని దోసిలిపట్టి కళ్లుమూసుకుంది – అల్లాని ధ్యానిస్తూ.

వసారాలో ఆడుకుంటున్న పిల్లలిద్దరూ ఒక్కసారే పెద్దగా కేకేశారు– "అమ్మీ అబ్దుల్ భయ్యా ఆయే ––– " ★

వచ్చేవారం కథ:

అమ్మ సిగ్గు

ఎం. ఆర్. అరుణకుమారి